# కలిసిరాని పొగాకు సాగు

- చీడపీడలతో పెరిగిన పెట్టుబడులు
- గణనీయంగా తగ్గిన దిగుబడులు
- దక్కని గిట్టుబాటు ధర
- ఆందోళనలో రైతులు

**కోవెలకుంట్ల:** ఈ ఏడాది రైతులకు పొగాకు సాగు కలిసి రాలేదు. సాగుకు ముందు వర్షాభావం, పైరు వివిధ దశల్లో అధిక వర్షాలు, చీడపీడలు చుట్టు ముట్టి వారిని నష్టాల ఊబిలోకి నెట్టాయి. పెట్టుబడులతో పాటు చీడపీడల నివారణకు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. తీరా దిగుబడులు తగ్గడం, గిట్టుబాటు ధర లభించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

### 3,105 ఎకరాల్లో సాగు

స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని ఆరు మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో 615 ఎకరాల్లో పొగాకు సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఆయా మండలాల్లో అత్యధికంగా 3,105 ఎకరాల్లో సాగుచేశారు. సబ్ డివిజన్‌లోని అవుకు మండలంలో 1,535 ఎకరాల్లో, సంజామల మండలంలో 613 ఎకరాల్లో, ఉయ్యాలవాడ మండలంలో 525 ఎకరాల్లో, కొలిమిగుండ్ల మండలంలో 207 ఎకరాల్లో, కోవెలకుంట్ల మండలంలో 173 ఎకరాల్లో, దొర్నిపాడు మండలంలో 52 ఎకరాల్లో నాటురకం, హెచ్‌డీబీఆర్, బార్లీ, వర్జీనియా, తదితర రకాలకు చెందిన పొగాకును సాగు చేశారు. ప్రస్తుతం నాలుగు నెలల పంటకాలం కలిగిన పైరు చేతికందడంతో రైతులు పొగాకు కొట్టడం, దోరణాలు కట్టడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.



పొగాకును తోరణాలుగా కుడుతున్న కూలీలు



పొగాకు తోరణాలు

### భారీగా తగ్గిన దిగుబడి

చీడపీడల ప్రభావం దిగుబడులపై పడింది. ఎకరాకు 500 నుంచి 600 తోరణాలు వస్తానుకుంటే 300 నుంచి 350 లోపే దిగుబడులు వస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆకు కొట్టడం, తోరణాలుగా కుట్టడం, పందిర్లు వేయడం వంటి పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ఒక్క తోరణం కుట్టినందుకు కూలికి రూ. 30 చెల్లించాల్సి వస్తోంది. అధిక వర్షాల కారణంగా దిగుబడులు తగ్గడంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రైతులను వేధిస్తోంది. గతేడాది క్వింటా పొగాకు రూ. 12 వేలు ధర పలికింది. ఈ ఏడాది ప్రస్తుతం క్వింటా రూ. 8 వేలు మాత్రమే పలుకుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా రావని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి క్వింటాకు రూ. 12 వేలు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### వెంటాడిన చీడపీడలు

ఈ ఏడాది పొగాకు సాగు ఆరంభం నుంచి రైతులకు కష్టాలు తప్పలేదు. నాట్లు వేయడం, కలుపునివారణ, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 40 వేల వరకు వెచ్చించారు. కౌలు రైతులైతే కౌలు రూపంలో అదనంగా రూ. 15 వేలు చెల్లించాల్సి వచ్చింది. పైరు రెండున్నర నెల దశలో తుపాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురియడంతో నీటికుట్టు తెగులు సోకి ఆకులు ఎండిపోయాయి. తెగులు నుంచి పైరును కాపాడుకునేలోపే అధిక వర్షాల కారణంగా పొగాకును పురుగు ఆశించి నష్టం చేకూర్చింది. పైరును రక్షించుకునేందుకు రెండు, మూడు దఫాలు క్రిమి సంహారక మందు పిచికారీ చేయాల్సి వచ్చింది. ఎడతెరపి లేని వర్షాలతో పైరులో కలుపు విపరీతంగా పెరిగి పంటలో ఎదుగుదల నిలిచిపోయింది.

### పెట్టుబడులు పెరిగాయి



ఈ ఏడాది ఎకరా రూ. 14 వేలు చెల్లించి ఐదు ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. ఎకరాకు రూ. 3,500 చెల్లించి నాట్లు వేశాను. రసాయన ఎరువులు, కలుపునివారణ, పురుగు ఆశించిన పైరును కాపాడుకునేందుకు రెండు దఫాలు క్రిమి సంహారక మందులు పిచికారీ చేశాను. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 40 వేలు వెచ్చించాను. అధిక వర్షాల కారణంగా కలుపు, తెగుళ్లు ఆశించి పెట్టుబడులు పెరిగాయి.

–పీరా,రైతు, సొదరదిన్నె, కోవెలకుంట్ల మండలం

### గిట్టుబాటు ధర కల్పించాలి



అధిక వర్షాలతో ఈ ఏడాది పొగాకు రైతులకు నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ. 25 వేలు వెచ్చించి ఆరు ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. పైరు చేతికందే దశలో ఎస్సార్బీసీకి అధికంగా నీటిని విడుదల చేయడంతో పంటంతా నీట మునిగి దెబ్బతినింది. అరకొరగా దిగుబడులు చేతికందుతున్నాయి. మార్కెట్‌లో పొగాకు గిట్టుబాటు ధర లేదు. ప్రభుత్వం క్వింటా రూ. 12 వేల నుంచి రూ. 15 వేల ధర ప్రకారం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– నాగరాజు, రైతు, గుంజలపాడు, కోవెలకుంట్ల మండలం

## క్లుప్తంగా

### లింగవివక్షను నిర్మూలిద్దాం



గర్భిణులకు బహుమతులను అందజేస్తున్న జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు

**బనగానపల్లె :** లింగవివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బ్రహ్మానంద ఆచారి పిలుపునిచ్చారు. మండలంలోని బీరవోలు గ్రామంలోని ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం లింగవివక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తి సహకారంతో గర్భిణులకు బహుమతులను ప్రదానం చేశారు.

### 25న మండల్ మీట్

**అవుకు:** ఈనెల 25వ తేదీన అవుకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల మీట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంగన్న శుక్రవారం తెలిపారు. మండలంలోని ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతిపై చర్చ జరుగుతుందని, ప్రతి అధికారి హాజరు కావాలని సూచించారు. అలాగే ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకురావచ్చన్నారు.

### 20 నుంచి పశువైద్య శిబిరాలు

**సంజామల:** ఈ నెల 20 నుంచి 31వరకు గ్రామాలలో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మోహన్ రావు తెలిపారు. 20న ఆకుమల్ల, నట్లకొత్తూరు, 21న నొస్సం, వసంతాపురం, 22న పేరుసోముల, ముచ్చలపురి, 23న ముదిగేడు, రెడ్డిపల్లె, 24న గిద్దలూరు, 25న కమలపురి, రాంభద్రునిపల్లె, 26న సంజామల, 27న కానాల, 28న ఆర్.లింగందిన్నె, ఎగ్గోని, 29న ముక్కమల్ల, 30న ఆల్వకొండ, 31న అక్కంపల్లె గ్రామాలలో వైద్య శిబిరాలు ఉంటాయన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సంజామల:** మండల కేంద్రం సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. మండలంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**కోవెలకుంట్ల:** మండలంలోని కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి, దొర్నిపాడు విద్యుత్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామమోహన్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులను దృష్టిలో ఉంచుకుని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పు

**బనగానపల్లె :** మండలంలోని బనగానపల్లె పాతపాడు పసుపల సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. రైతులకు త్రీఫేస్ విద్యుత్‌ను ఉదయం 4 నుంచి 9వ వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా చేస్తామన్నారు.

**బేతంచెర్ల :** మండలకేంద్రంలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీ మధు సూదన్‌రెడ్డి, టౌన్ ఏఈ పుల్లయ్య శుక్రవారం తెలిపారు. పరిశ్రమల యజమానులు, విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

**ప్యాపిలి:** మండల పరిధిలోని నేరేడుచెర్ల, బోయించెర్వుపల్లి, బూరుగల, కౌలుపల్లి, రాచర్ల, అలేబాదు, మునిమడుగు, సీతమ్మతండా గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వినయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. రాచర్ల ఫీడర్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్లకు 33 కేవీ లైన్ అమర్చుతున్నట్లు ఆయన తెలిపారు. దీంతో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

### ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పని సరి



ద్విచక్ర వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

**కోవెలకుంట్ల:** ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని గ్రామ పంచాయతీ సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్. ఇన్సురెన్స్, తదితర రికార్డులు లేని 30 ద్విచక్ర వాహన చోదకులకు జరిమానా విధించారు.

## వారసత్వ భూమిపై అసత్య ప్రచారం తగదు



మాట్లాడుతున్న సర్పంచ్ శీలం చంద్రశేఖర్ నాయుడు

**డోన్ :** తమకు వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూమిని ప్రభుత్వ భూమి అంటూ కొందరు దురుద్దేశంతో చేస్తున్న ప్రచారం చేస్తున్నారని డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌నాయుడు, గ్రామ రైతులు స్పష్టం చేశారు. సర్పంచ్ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 102లో తలారి బొజ్జన్న కుటుంబానికి వారసత్వంగా వచ్చిన సుమారు 50 ఎకరాల భూమిలో 40 మంది వారసులకు ఒక్క ఎకరా 10 సెంట్ల చొప్పున సంక్రమించిందన్నారు. ఈ భూమి ప్రభుత్వ భూమి అంటూ.. దానిని ఆక్రమించిన తాము విక్రయించినట్లు కొందరు అసత్య ప్రచారం చేస్తుండటం బాధించిందన్నారు. ఈ విషయంలో అధికారులపై కూడా లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. గ్రామస్తులు తలారి విజేయుడు, చిన్నమాదన్న, నాగముని, తలారి బాలన్న పాల్గొన్నారు.

## నేడు ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర

**సంజామల:** మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సాల్మన్ కోరారు. సంజామల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ అనిల్ కుమార్‌తో కలసి శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లడుతూ.. మండలంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మూడవ శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతి ఉద్యోగి కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని సూచించారు.

**డోన్:** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. ఈనెల 18న శనివారం ఉదయం 10 గంటలకు పాతబస్టాండ్ గాంధీ సర్కిల్‌లో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**కొలిమిగుండ్ల:** ప్రతి మూడో శనివారం గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి శుక్రవారం తెలిపారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, బస్ స్టాప్‌ల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేడు స్వచ్ఛ కోవెలకుంట్ల ర్యాలీ

**కోవెలకుంట్ల:** స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని పాండురంగస్వామి దేవాలయం నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు స్వచ్ఛ కోవెలకుంట్ల ర్యాలీని శనివారం నిర్వహిస్తున్నట్లు ఈఓ ప్రకాష్‌నాయుడు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఆయా కాలనీల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

## చీటింగ్ కేసులో పాత్రికేయుడికి రిమాండ్

**గుత్తి:** చీటింగ్ కేసులో పట్టుబడిన డోన్‌కు చెందిన విజయ్‌కుమార్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గుత్తి ఎస్ఐ సురేష్ తెలిపిన మేరకు... 2022లో గుత్తికి చెందిన మైనుద్దీన్‌కు చుక్కల భూములకు ఎన్‌ఓసీ (క్రమబద్ధీకరణ) ఇప్పిస్తామంటూ డోన్‌కు చెందిన విజయకుమార్ (విలేకరి), అనంతపురానికి చెందిన కేశప్ప (విలేకరి) నమ్మబలికి రూ. 6 లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత ఎన్‌ఓసీ ఇప్పించకుండా మిన్నకుండిపోయారు. దీనిపై పలుమార్లు మైనుద్దీన్ అడిగినా వారు పట్టించుకోలేదు. డబ్బు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో జరిగిన మోసాన్ని వివరిస్తూ బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు విజయకుమార్, కేశప్పపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం విజయకుమార్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న కేశప్ప కోసం గాలిస్తున్నారు.

## కూటమి ప్రభుత్వంలో చిరుద్యోగులకు ప్రాణసంకటం

**డోన్ టౌన్ :** కూటమి ప్రభుత్వ పాలనలో చిరుద్యోగులకు ప్రాణ సంకటంగా మారిందని సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరామ్, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, కోశాధికారి నాగమద్దయ్య అన్నారు. బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం వీఓఏ లక్ష్మీదేవి ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఏపీఎం మధుసూదన్‌గౌడ్, సీసీ రాజేశ్వరిలను వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజాకు వినతి పత్రం అందజేశారు. కొత్తబురుజు వీఓఏ వెంకట్రామిరెడ్డి మరణం మరవక ముందే రంగాపురం వీఓఏ లక్ష్మీదేవి ఆత్మహత్యాయత్నం బాధ కలిగిస్తోందన్నారు. సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, తిరుపాల్, వేణుకుమార్, సురేష్, దానియల్ ఉన్నారు.

## పరిపాలనాదక్షుడు శ్రీకృష్ణ దేవరాయులు

**బేతంచెర్ల:** విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించి ప్రజలకు జనరంజకమైన పాలన అందించిన మహోన్నత వ్యక్తి శ్రీ కృష్ణ దేవరాయలు అని బలిజ సంఘం నాయకులు హరి, సుబ్బారెడ్డి, నాగమోహన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండులో శ్రీకృష్ణ దేవరాయల జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిజ సోదరులు కోనరామకృష్ణ, హరిచంద్ర, శేషు, నాగేశ్వరరావు, మధు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

## వీఓఏలపై వేధింపులు మానుకోవాలి



డీటీ మారుతికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

**బేతంచెర్ల :** బాధ్యతగా పనిచేసే వీఓఏలపై అధికారులు, రాజకీయ నాయకులు వేధింపులు మానుకోవాలని సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, మధు శేఖర్ అన్నారు. వీఓఏ లక్ష్మీదేవిని వేధింపులకు గురి చేసిన వెలుగు ఏపీఎంను, సీసీలను సస్పెండ్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం వీఓఏలు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి.. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ దస్తగిరి బాబు, డీటీ మారుతికి వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన వీఓఏ లక్ష్మీదేవిపై వెలుగు ఏపీఎం మధుసూదన్ గౌడు, సీసీ లు వేధింపులకు గురి చేయడంతో గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా వీఓఏలను తొలగించడం భావ్యం కాదన్నారు.

### ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన



ప్రాంతీయ పశువైద్యశాలను పరిశీలిస్తున్న జడ్జి షేక్ అబ్దుల్ రెహమాన్

**బనగానపల్లె రూరల్ :** పట్టణంలోని పలు ప్రభుత్వ భవనాలను బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి షేక్ అబ్దుల్ రెహమాన్ శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పరిశీలించా రు.బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. దీంతో తాత్కాలికంగా కోర్టు కార్యకలాపాల నిర్వాహణకు అనుకూలమైన భవనాలను పరిశీలించారు. మొదట పట్టణంలోని సచివాలయం-3,మార్కెట్‌యార్డుసమీపంలో ఉన్న సచివాయంతోపాటు స్థానిక ప్రాంతీయ పశువైద్య శాలలోని రైతుశిక్షణ భవనాన్ని సందర్శించారు.

### వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

**డోన్ రూరల్ :** పట్టణ సమీపంలోని ఆర్‌టీఓ కార్యాలయంలో శనివారం డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఆర్‌టీఓ క్రాంతికుమార్ తెలిపారు. ఆర్‌టీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా కర్నూలు రమేష్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. డోన్, ప్యాపిలి మండలాలలోని స్కూల్ బస్సు, ఆటో, ట్రాక్టర్, టాటా మ్యాజిక్, లారీ డ్రైవర్లు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

### ఇసుక లారీ స్వాధీనం

**బనగానపల్లె రూరల్ :** పట్టణంలోని పలు ప్రధా న రహదారులపై సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా తాడిపత్రి నుంచి ఆత్మకూరు వైపు అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాన్ని ఆర్టీఓ అధికారులకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.

### నాటుసారా స్వాధీనం

**అవుకు:** బనగానపల్లె ఎక్సైజ్‌శాఖ పరిధిలో జరిగిన దాడుల్లో వంద లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వర్ధనాదేవి శుక్రవారం తెలిపారు. అవుకు మండలం రామాపురం గ్రామంలో తలారి సుంకమ్మ వద్ద 10 లీటర్లు, బాలపుల్లయ్య వద్ద 10 లీటర్లు, బనగానపల్లె పట్టణంలో చిన్న ఈరన్న వద్ద 10 లీటర్ల సారా, పశుపలతండాలో శక్రిబాయి వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కేసులు నమో దు చేశామన్నారు. అలాగే కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామంలో రమేష్ నాటుసారా తరలిస్తుండగా పట్టుకొని మోటర్ సైకిల్‌ను సీజ్ చేసి 60 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదే గ్రామంలో నాటుసారా అమ్ముతూ తమను చూసి పారిపోయిన గులగల్ల నాగేంద్ర, వెంకటరాముడుపై కేసులు నమోదు చేశామన్నారు.

### వ్యక్తిపై దాడి

**బేతంచెర్ల :** పట్టణంలోని బనగానపల్లె రైల్వే గేట్ సమీపాన దుర్గాపేట కాలనీకి చెందిన గజ్జి తిరుమలేష్ అనే వ్యక్తిపై దాడి చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వ్యక్తిగత కక్షలతో అదే కాలనీకి చెందిన గూటం సాయి అనే వ్యక్తి రాడ్డుతో దాడి చేయడంతో గజ్జి తిరుమలేష్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో చికిత్స నిమత్తం శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వలిమా వేడుకలో మాజీ ఎమ్మెల్యే

**బనగానపల్లె :** పట్టణంలోని ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం జరిగిన వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్ కుమారుడు అబ్దుల్ ఉబేద్ వలిమా ఫంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అవుకు, బనగానపల్లె కొలిమిగుండ్ల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అంబటి గురివీరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గుండం శేషిరెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్ తదితరులు పాల్గొన్నారు.



వరుడు అబ్దుల్‌ఉబేద్‌తో మాజీ ఎమ్మెల్యే కాటసాని, వైఎస్సార్‌సీపీ నాయకులు

## వైభవంగా తిరుచ్చి మహోత్సవం

**బేతంచెర్ల :** మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి ఆలయ మాడవీధుల్లో తిరుచ్చి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు వేదపండితులు జ్వాలా చక్రవర్తి, అర్చకులు మనోహర్ మద్దిలేటి నరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో కొలువుంచి ఆలయ మాడ వీధుల్లో మంగళ వాయిద్యాలతో ఊరేగింపు చేశారు. భక్త జనసందోహం, గోవిందనామ స్మరణలతో స్వామి వారు పుష్పాలంకరణ శోభితుడై కాగడాల వెలుతురులో శోభాయమానంగా భక్తులకు దర్శనమిచ్చాడు.



మద్దిలేటి నరసింహస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

### ఆటో డ్రైవర్ నిజాయితీ



బాధితుడికి పర్సు అందజేస్తున్న ఆటో డ్రైవర్ కాశి

**బేతంచెర్ల :** మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బేతంచెర్లకు వచ్చి శుక్రవారం సాయంత్రం గ్రామానికి వెళ్తుండగా బుగ్గానిపల్లెతండాకు రాజేష్ అనే ప్రయాణికుడు ఆటోలో ఎక్కాడు. బుగ్గానిపల్లె తండాలో రాజేష్ దిగి వెళ్లిపోయాడు. సిమెంట్ నగర్ గ్రామానికి వెళ్లిన తరువాత ఆటోలో పర్సు పడి ఉండటంతో అందులో ఉన్న ఫోన్ నంబర్ వివరాల ఆధారంగా ఆటో డ్రైవర్ కాశి అతనికి ఫోన్ చేశాడు. అతడు సిమెంట్ నగర్‌కు రావడంతో గ్రామస్తులు యకోబ్, జేమ్స్, జాకోబ్ సమక్షంలో కాశి తనకు దొరికిన రూ.8వేల నగదును బుగ్గానిపల్లెతండాకు చెందిన రాజేష్‌కు అందజేశాడు.

### మహిళలు అక్షరాస్యులుగా మారాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

**బనగానపల్లె :** మహిళలు అక్షరాస్యులుగా మారాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. స్థానిక పొదుపు భవనంలో శుక్రవారం ఉల్లాస్ వయోజన విద్య అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్య అడిషనల్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మండలంలో అన్ని గ్రామాల నుంచి వచ్చిన 72 మంది వలంటీర్ టీచర్స్, వీఓఏఎస్‌లకు మహిళా అక్షరాస్యతపై శిక్షణ ఇచ్చారు. ప్రతి మహిళ సాయంత్రం రెండు గంటలసేపు అక్షరాలు నేర్చుకోవాలన్నారు. వెలుగు ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### చౌడేశ్వరీదేవికి పల్లకీ సేవ

**బనగానపల్లె రూరల్ :** మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం సాయంత్రం పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారికి ఉదయం కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ చౌడేశ్వరీదేవి ఉత్సవమూర్తిని పల్లకీలో అందంగా ముస్తాబు చేసి పల్లకీ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


### టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలి

**డోన్ టౌన్ :** ఇళ్లు లేని నిరుపేదలకు తక్షణమే టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా నాయకులు చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ సమీపంలోని టిడ్కో గృహాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ టిడ్కో గృహాల కోసం స్థలాన్ని త్యాగం చేసిన టైలర్లు నేటికి అద్దె ఇళ్లలో నివసిస్తున్నరన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లను కూడా పంపిణీ చేయడానికి సిద్ధంగా లేని కూటమి ప్రభుత్వం ఇక హామీలను ఏమి అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అక్బర్‌బాషా, శివరామ్, ఖాజా, హరి తదితరులు ఉన్నారు.

### బీసీ సంక్షేమ సంఘం మండల ఇన్‌చార్జ్ నియామకం

**ప్యాపిలి:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్యాపిలి మండల ఇన్‌చార్జ్‌గా చిన్నపొదిళ్లకు చెందిన ఎస్‌ఈ రమేశ్‌గౌడ్‌ను నియమించారు. కర్నూలు బీసీ భవన్‌లో శుక్రవారం జరిగిన బీసీ నాయకు ల సమావేశంలో ఆయనను మండల ఇన్‌చార్జ్‌గా ఎంపిక చేశారు. బీసీల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని రమేశ్ గౌడ్ తెలిపారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ

**డోన్ టౌన్ :** ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ నాగమణితో కలిసి ఆవిష్కరించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ఎన్జీఓ సంఘం తాలూకా అధ్యక్షుడు సమీవుల్లా, కార్యదర్శి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంఘం సభ్యులు మస్తాన్, రాముడు, రంగస్వామి, గౌరీ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

### శివ మాలధారులకు భిక్ష ప్రారంభం

**బేతంచెర్ల :** స్థానిక నంద్యాల రహదారిలో వెలసిన దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శివ మాలధారులకు గురుస్వామి మాదినేని నారాయణ స్వామి ఆధ్వర్యంలో భిక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. శివమాలధారణ చేపట్టిన శివ స్వాములకు 41 రోజుల పాటు భిక్ష ఏర్పాటు చేసినట్లు గురుస్వామి తెలిపారు. గత 5 సంవత్సరాలుగా భిక్ష నిర్వహిస్తున్నామన్నారు. శివ మాలధారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.